క్లుప్తంగా

వైభవంగా మహానందీశ్వరుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో మహానందీశ్వర దంపతులు

మహానంది: మహానందీశ్వర దంపతులకు మంగళవారం కల్యాణోత్సవ పూజలు వైభవంగా జరిగాయి. ఈఓ కాపుచంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు శ్రీ గంగ, శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. స్థానిక అలంకార మండపంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, మాంగల్య ధారణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అలాగే రాత్రి స్థానిక యాగశాలలో స్వామి,అమ్మవార్లకు ఏకాంత సేవ పూజలు నిర్వహించారు.

ఆలయంలో అభివృద్ధి పనులు ప్రారంభం



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వెలుగోడు: పట్టణంలోని లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఆలయ ఆవరణలో సిమెంట్ బెడ్డు వేసేందుకు ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బవనాశి మహేష్ సహకారంతో పనులు ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు బచ్చు రాము, సభ్యులు బళ్లాని బాలయ్య, లాలం నాగార్జున, శ్రీరాం నాగేశ్వరరావు, మలేపాటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ చంద్రశేఖర్ మృతి



మహానంది: తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి, జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయ ఏఓ డాక్టర్ చంద్రశేఖర్ మంగళవారం మృతి చెందారు. తిమ్మాపురం పీహెచ్‌సీలో సుమారు మూడేళ్ల పాటు వైద్యసేవలు అందించి ప్రజల మన్ననలు పొందారు. మూడు పర్యాయాలు ఉత్తమ వైద్యాధికారిగా అవార్డులు అందుకున్న ఆయన గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి ఎంతో బాధాకరమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, తిమ్మాపురం వైద్యాధికారి భగవాన్‌దాస్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

నందికొట్కూరు: పదో తరతగతి ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో రాబోయే పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి వారికి సూచనలు సలహాలు ఇచ్చారు.

ఈకేవైసీకి నేడు ఆఖరు

శిరివెళ్ల: పీఎం కిసాన్‌కు ఈకేవైసీ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు అన్నారు. మంగళవారం గోవిందపల్లె రైతు భరోసా కేంద్రంలో పీఎం కిసాన్‌పై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 5,200 మంది రైతులు పీఎం కిసాన్ కింద లబ్ధి పొందుతున్నారని తెలిపారు. ఇంకా 77 మంది ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. ఈ నెల 21వ తేదీలోగా రైతు భరోసా కేంద్రాలు, ఆధార్ కేంద్రాల్లో చేయించుకోవాలని సూచించారు. అలాగే భూమి వివరాలకు ఆధార్ లింక్ చేయించుకోవాలని తెలిపారు. ఏఓ సుధాకర్, ఏఈఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రారంభం

నంద్యాల(సిటీ): నంద్యాలలోని పద్మావతినగర్‌లో రూ. 38 లక్షలతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి, ఏఎస్పీ ప్రవీణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డితో కలిసి మంగళవారం ప్రారంభించారు. జిల్లా కేంద్రం అయ్యాక ట్రాఫిక్ పెరిగినందున వాహనచోదకులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని ఎమ్మెల్యే అన్నారు. ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాంషావలి, నాగరాజు పాల్గొన్నారు.

ఏ గ్రామానికి వచ్చినా అభివృద్ధిని చూపిస్తాం

- ప్రతిపక్షాలకు ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సవాల్
- పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే, కేడీసీసీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి



సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కేడీసీసీ చైర్‌పర్సన్ విజయ మనోహరి



మహిళలకు మెగా చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

వెలుగోడు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామని శ్రీశైలం ఎమ్మెల్యే, ఎథిక్స్ కమిటీ చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. ప్రతిపక్ష నాయకులు ఏ గ్రామం వచ్చినా మేం చేసిన అభివృద్ధిని చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని సవాలు చేశారు. టీడీపీ నేతలు కళ్లున్న కబోదుల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళవారం మండలంలోని అబ్దుల్లాపురం గ్రామంలో నూతనంగా రూ.17.67 లక్షలతో నిర్మించిన పాల కేంద్రం, గ్రామ సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు.

రైతు బజారు ప్రారంభం

వెలుగోడు పట్టణంలో రూ.95 లక్షలతో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. ఇకమీదట వ్యాపారస్తులు రైతు బజార్లో గదులు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకోవచ్చని చెప్పారు.

ఇది కాదా అభివృద్ధి అంటే..

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందించారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులం, మతం, పార్టీ, వర్గం చూడకుండా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. టీడీపీ నాయకులు తమకు సంక్షేమ పథకాలు అందలేదని చెబితే..మేం ఏయే సంక్షేమ పథకాలు ఇచ్చామో చూపించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సంక్షేమ పథకాలే కాదు..నియోజకవర్గంలో మేం చేసిన అభివృద్ధిని చూపించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. నియోజకవర్గంలో ఒకటి, రెండు మినహా అన్ని రోడ్లు నిర్మించామన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలోని లేని విధంగా ప్రతి గ్రామ, వార్డు పరిధిలో బ్రహ్మాండంగా సచివాలయ భవనాలు, ఆర్‌బీకే కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి గ్రామంలో కూడా గోడౌన్లు నిర్మించామని, త్వరలోనే వాటిని కూడా ప్రారంభిస్తామని తెలిపారు. ఇది అభివృద్ధి కాదా అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి సొంత గ్రామం వేల్పనూరులో పీహెచ్‌సీ నిర్మాణం, వెలుగోడు పట్టణంలో రూ.6 కోట్లతో సీహెచ్‌సీ నిర్మాణం, ఆత్మకూరులో రూ.4 కోట్లతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించింది కనిపించడం లేదా అని నిలదీశారు.

రోఖియాబీ దర్గాలో ప్రార్థనలు

శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పట్టణంలోని రోఖియాబీ దర్గాను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

వెలుగోడు సొసైటీ భవనం ప్రారంభం

వెలుగోడు పట్టణంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘ నూతన భవనాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి , కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి ప్రారంభించారు. గతంలో గదులు చిన్నగా ఉండడంతో రూ. 30 లక్షలతో సొసైటీ భవనం అదనపు గదులను ఏర్పాటు చేశారు.

సీఎం జగన్ మహిళల ఆత్మగౌరవం పెంచారు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మహిళల ఆత్మగౌరవాన్ని పెంచారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యేతో పాటు కేడీసీసీ చైర్‌పర్సన్ విజయ మనోహరి 4వ విడుత వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేశారు. మహిళలు వారిని ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఎన్నికల ముందు చెప్పినట్లుగానే 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి మహిళల పొదుపు సంఘాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నేరుగా నిధులు జమ చేసిందని చెప్పారు. మహిళల పేరిట బ్యాంకుల్లో అప్పు మొత్తం రూ. 25,570.80 కోట్లను ఆసరా పథకంలో భాగంగా నాలుగు విడతల్లో అందజేశారని తెలిపారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేసి చూపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు వివిధ రూపాల్లో కృతజ్ఞలు చెబుతున్నారని కేడీసీసీ చైర్‌పర్సన్ తెలిపారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి సీఎం జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. వైఎస్సార్ ఆసరా పథకంలో భాగంగా వెలుగోడు మండలానికి సంబంధించి లబ్ధిదారులకు మంజూరు అయిన రూ.7,26,66,875 చెక్కును డ్వాక్రా మహిళలకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఏడీఎం అబ్దుల్ రహిమాన్, డీఈ సుబ్బారెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ బాలస్వామి, సెక్రటరీ వైవీ సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపం రెడ్డి, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ మెంబర్ సయ్యద్ సులేమాన్, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ నందిరెడ్డిగారి వెంకటేశ్వరమ్మ, అబ్దుల్లాపురం సర్పంచ్ నాగలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థికసాయం

పట్టణానికి చెందిన మంగళి ప్రవీణ్ కుమార్ ఎంబీబీఎస్ చదువుతున్నాడు. ఇతని చదువుల నిమిత్తం ఎమ్మెల్యే శిల్పా రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నిర్ణీత ధరకే ఆహార పదార్థాలు విక్రయించాలి

శ్రీశైలం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సూచించిన రేట్లకే ఆహార పదార్థలను, కూల్ డ్రింక్, వాటర్ బాటిళ్లను విక్రయించాలని నంద్యాల జిల్లా సివిల్ సప్లయ్ ఆఫీసర్ (డిప్యూటీ కలెక్టర్) వెంకటరాముడు ఆదేశించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్థానిక శ్రీశైలం హోటల్స్, కూల్ డ్రింక్ షాప్‌ల నిర్వాహకులతో స్థానిక తహసీల్దార్ గుర్రప్పలుతో కలసి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు ఎవరైన విక్రయిస్తే సదరు దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

తపాలా సేవలపై ప్రచారం

శ్రీశైలంప్రాజెక్ట్: భారత తపాలా శాఖ అందిస్తున్న వివిధ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరుతూ మంగళవారం శ్రీశైలం ప్రాజెక్ట్‌లో పోస్టల్ సిబ్బంది ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్, సేవింగ్, గ్రామీణ తపాలా బీమా పాలసీలు కూడా అందుబాటులో ఉన్నట్లు ప్రజలకు వివరించారు పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కె.రాఘవేంద్ర, పోస్ట్‌మాస్టర్ మధుకర్ పాల్గొన్నారు.

నేడు 'వలంటీర్లకు వందనం'

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి కె.బాలూనాయక్ మంగళవారం తెలిపారు. స్థానిక కృష్ణవేణి (రెడ్ల) కళ్యాణమండపంలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కార్యక్రమానికి అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి హాజరవుతారని చెప్పారు.

రేపు మిడుతూరులో..

మిడుతూరు: మండలంలో ఈనెల 22న వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే తొగురు ఆర్థర్, ఎంపీపీ మల్లు వెంకటేశ్వరమ్మ హాజరై వలంటీర్లను సత్కరిస్తారన్నారు.

చంద్రబాబును నమ్మొద్దు



జీఎం నూర్ అహ్మద్, పార్టీలో చేరిన నాయకులతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, దారా సుధీర్

- ఏపీ శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- వైఎస్సార్‌సీపీలో చేరిన 20 మంది టీడీపీ నాయకులు
- పాములపాడు మండలం యర్రగూడూరు గ్రామం నుంచి చేరికలు

నందికొట్కూరు: రంగురంగుల మేనిఫెస్టోతో మళ్లీ వస్తున్న చంద్రబాబు నాయుడును నమ్మొద్దని శాప్ రాష్ట్ర చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో యర్రగూడూరు గ్రామానికి చెందిన బాలీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో టీడీపీ సీనియర్ నాయకులు జీఎం నూర్ అహ్మద్, జీఎం బషీర్, చాంద్ బాషా, ఖాజా, మన్సూర్, ఆలీ, రసూల్, వలి, రఫి, ఖాజావలి, సమీర్, రాజు, షఫి, జుబైర్, తబ్రేస్, వలి, అన్వర్, అబ్దుల్లా, హుమయాన్, హైదర్, జఫ్రుల్లా పాటు 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి బైరెడ్డి సిద్దార్థరెడ్డి, సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో ముస్లింలకు పెద్ద పీట వేశారన్నారు. వైఎస్సార్‌సీపీలోనే ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందని చెప్పారు. రూ. మూడు కోట్లతో పట్టణంలో షాదీఖానాను పూర్తి చేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు అబుబక్కర్, జబ్బార్, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లతో నిష్పక్షపాతంగా పథకాల అమలు

- లంచం, అవినీతి, అక్రమాల్లేకుండా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ దారా సుధీర్
- జూపాడుబంగ్లాలో 'వలంటీర్లకు వందనం'



సేవావజ్ర అవార్డు గ్రహీతను సత్కరిస్తున్న దారా సుధీర్, ప్రజాప్రతినిధులు, అధికారులు

జూపాడుబంగ్లా: వలంటీర్ వ్యవస్థతో నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రెండుకళ్లలాంటివని వైఎస్సార్ సీపీ నందికొట్కూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. మంగళవారం మండలకేంద్రమైన జూపాడుబంగ్లా వైకేపీ కార్యాలయంలో వలంటీర్ల అభినందన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దారా సుధీర్ మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ప్రజలకు ఉన్న ఊళ్లోనే ఎలాంటి సిఫారసు లేకుండా, పైసా ఖర్చులేకుండా సంక్షేమ పథకాలందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. టీడీపీ నాయకులు వలంటీర్లపై తప్పుడు ప్రచారం చేస్తూ అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తున్నారని అలాంటి వారికి రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు సర్టిఫికెట్, మెడల్, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీడీఓ సూర్జహాన్, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, జిల్లా జాయింట్ సెక్రెటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఈఓపీఆర్డీ మధు మోహనచక్రవర్తి, సర్పంచులు మొట్టెబాలస్వామి, పీఎం నాగిరెడ్డి, శ్యామలమ్మ, ఈశ్వర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్‌రెడ్డి, హరికృష్ణ, వినయ్, గోవిందు, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథంలో వలంటీర్ల సేవలు

పాములపాడు: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ వలంటీర్లు సేవా దృక్పథంతో సేవలందిస్తున్నారని ఎంపీడీఓ సరస్వతి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఒకరికి సేవా వజ్ర రూ.45,000, 5 మందికి సేవా రత్న రూ.30,000, 202 మందికి సేవా రత్న రూ.15000 చొప్పున ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. అనంతరం దుశ్శాలువా, ప్రశంసా పత్రాలను అందించి సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు భాగ్యమ్మ, నారాయణ, వరప్రసాద్, కోట్ల చంద్రారెడ్డి, మౌలాలి, ఎంపీటీసీలు రమాదేవి, ముర్తుజాబి, దర్గాబాయి, సురేష్, కో ఆప్టెడ్ ముర్తుజావలి, మాజీ సర్పంచు విజయసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

నందికొట్కూరు : వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ దార సుధీర్ అన్నారు. మంగళవారం పగిడ్యాల మండల కేంద్రంలో పొదుపు భవనంలో వలంటీర్లకు వందన కార్యక్రమం నిర్వహించారు. మండలంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు సేవ వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించారు. సేవ వజ్రకు ఎంపికైన పగిడ్యాల కేంద్రానికి చెందిన నాగరత్నమ్మ, సేవా రత్నకు ఎంపికైన సంకిరేణిపల్లె చెందిన చెన్నరాయుడుకు, సేవా మిత్ర అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలతో పాటు సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, గ్రామ సర్పంచు శేషన్న, ఎంపీడీఓ కవిరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్యాల నాగిరెడ్డి, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల కష్టాలు తెలిసిన సీఎం వైఎస్ జగనన్న

నందికొట్కూరు: ప్రజల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని 13, 14వ వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల ఆత్మీయ పలకరింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మహానుభావుడు సీఎం వైఎస్ జగనన్ననేనన్నారు. సీఎం వైఎస్ జగనన్న ఇచ్చిన హామీలకు కట్టుబడి అమలు చేశామన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల్లో 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగనన్నదేనని స్పష్టం చేశారు. ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు అశోక్, రవూఫ్, లాలు, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ అబుబక్కర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, సులోచన, శ్రీకాంత్, రషీద్, రజనీకుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆర్ట్ శ్రీను, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు



శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి

నంద్యాల(అర్బన్): స్థానిక ప్రథమనంది ఆలయంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో మంగళవారం భీష్మ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నంద్యాల బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్ హాజరై భీష్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శివ, సెక్రటరీ శ్రీనివాసులు, రామసుబ్బయ్య, రామ్మోహన్, మురళీకృష్ణ, పుల్లయ్య పాల్గొన్నారు.

జగతికి నిర్దేశం భీష్ముని ఉపదేశం

నంద్యాల(వ్యవసాయం): జగతికి నిర్దేశం భీష్ముని ఉపదేశమని వేదపండితుడు మాడుగుల నాగేంద్రశర్మ అన్నారు. మాఘమాసం భీష్మ ఏకాదశి, శ్రీవిష్ణు సహస్ర నామ జయంతిని పురస్కరించుకుని శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో సంజీవనగర్ రామాలయంలో సామూహిక విష్ణు సహస్ర నామస్తోత్రాన్ని నిర్వహించారు. మహిళలతో సామూహిక కుంకుమార్చన చేయించారు.

సింహగర్జన పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం రాత్రి బంజార సింహగర్జన పోస్టర్లను ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25న కదిరిలో బంజార సింహగర్జన కర్యక్రమం నిర్వహిస్తున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాజమోహన్‌రెడ్డి, దేశం తిరుపం రెడ్డి, జయకృష్ణ, బంజార సంఘం నాయకులు విక్రమ సింహా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుల చెంతనే ఆరోగ్య సేవలు



కోనేటమ్మపల్లెలో ప్రజలకు మందులను పంపిణీ చేస్తున్న అధికారులు

నందికొట్కూరు: పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకం తెచ్చారని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త డాక్టర్ దారా సుధీర్ అన్నారు. బుధవారం పగిడ్యాల మండల పరిధిలోని బిరవోలు గ్రామంలో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డాక్టర్ దారా సుధీర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రోగులకు ఉచిత వైద్య పరీక్షలు డాక్టర్లు నిర్వహించారు. దారా సుధీర్ మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించడమే సీఎం వైఎస్ జగనన్న ధ్యేయమన్నారు. ప్రజల శ్రేయస్సు కోసం సీఎం జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఉచితంగా అన్ని రకాల వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుల్యాల దివ్య, గ్రామ సర్పంచు భాస్కర్, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్యాల నాగిరెడ్డి, షుకూర్, వీరారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష ప్రజలకు శ్రీరామరక్ష

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష శ్రీరామ రక్షలాంటిదని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోనేటమ్మపల్లె గ్రామంలో అధికారులు రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యురాలు తులసీరాణి, పంచాయతీకార్యదర్శులు ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహానంది: పేదల ఆరోగ్యానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని మహానంది ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. మహానందిలోని సచివాలయ ప్రాంగణంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి భగవాన్‌దాస్, సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు వైద్యపరీక్షలు చేపట్టారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని సచివాలయంలో కొత్తపల్లి, గువ్వలకుంట్ల గ్రామాల ప్రజలకు ఆధార్ క్యాంపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూసేందుకు, ప్రతి ఒక్కరిని ఏ కారణంచేతనైన సంక్షేమపథకాలకు దూరం కాకుడదని ఈ ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 22న ఎదురుపాడు గ్రామంలో ఎదురుపాడు, కొక్కెరంచ గ్రామాలవారికి, 23న దుద్యాల, నందికుంట గ్రామాల వారికి దుద్యాల గ్రామంలో ఆధార్‌క్యాంపులు నిర్వహిస్తామని చెప్పారు.

పల్స్ పోలియోపై అవగాహన కల్పించాలి

నందికొట్కూరు రూరల్ : గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ సూచించారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, వైద్య సిబ్బందిచే టాస్క్‌ఫోర్స్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 5 సంవత్సరాల లోపు పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు తులసీరాణి, ఈవోఆర్డీ సంజన్న, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

ఆత్మకూరు: గిరిజన ప్రాంతాల్లో ఆశా వర్కర్లుగా విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు రూ.10వేలు వేతనం పెంచాలని సీఐటీయూ పట్టణకార్యదర్శి రాంనాయక్, ఏసురత్నం అన్నారు. పట్టణంలోని సుదర్శన వర్మ భవన్‌లో మంగళవారం ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ చెంచు గిరిజన గూడేల్లో ఆశా వర్కర్లు విధులు నిర్వహిస్తున్న అతి తక్కువగా వేతనాలు వస్తున్నాయన్నారు.

పదో తరగతి పరీక్షలకు మూడు సెంటర్లు

జూపాడుబంగ్లా: ఈ ఏడాది పదో తరగతి వార్షిక పరీక్షలు రాయనున్న విద్యార్థుల సౌలభ్యం కోసం ఈ ఏడాది మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలో మూడు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు మండల విద్యాధికారి చిన్నమద్దిలేటి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో రెండు పరీక్షా కేంద్రాలు ఉండగా అదనంగా మరొకటి ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 123 మంది రెగ్యులర్, 62 మంది ప్రైవేటు విద్యార్థులు పరీక్ష రాసున్నట్లు తెలిపారు. మోడెల్‌స్కూల్ పరీక్షా కేంద్రంలో 170 మంది రెగ్యులర్ విద్యార్థులు, 65 మంది ప్రైవేటు విద్యార్థులు, గురుకుల పాఠశాలలో 124 మంది రెగ్యులర్, 49 మంది ప్రైవేటు విద్యార్థులు వార్షిక పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. మార్చి 18 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభమవుతాయని చెప్పారు.

కొత్తగా ఏర్పాటు కానున్న ఇంటర్ పరీక్షా కేంద్రం

ఈ ఏడాది ఇంటర్ వార్షిక పరీక్షలు రాయనున్న మండల విద్యార్థుల సౌకర్యార్థం జూపాడుబంగ్లాలో కొత్తగా ఇంటర్ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షల నిమిత్తం మోడల్‌స్కూల్లో ఇంటర్ పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలో గురుకులం, కస్తూర్బాగాంధీ, మోడల్ పాఠశాలలకు చెందిన ఇంటర్ విద్యార్థులు ఈ ఏడాది స్థానిక పరీక్షా కేంద్రంలోనే పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు.

24న మహానందికి కంచికామకోటి పీఠాధిపతి

మహానంది: కంచికామకోటి పీఠాధిపతి శ్రీశ్రీ విజయేంద్రసరస్వతి స్వామి ఈనెల 24వ తేదీ రాత్రి మహానందికి వస్తున్నట్లు పీఠం ప్రతినిధులు మంగళవారం తెలిపారు. 25, 26వ తేదీల్లో రెండు రోజుల పాటు మహానందిలోనే ఉండి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారన్నారు. అలాగే మహాకుంభాభిషేకం, మహానందీశ్వర గర్భాలయ నూతన కలశ ప్రతిష్ఠ మహోత్సవాలకు ముహూర్తం తేదీలను నిర్ణయిస్తారన్నారు.

ఓంకారంలో ఆంజనేయుడికి విశేష పూజలు

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఓంకారంలో కొలువైన శ్రీ వీరాంజనేయస్వామి వారికి మంగళవారం విశేషపూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు దర్శించుకుని స్వామివారికి ఇష్టమైన సింధూరంతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఆలయ అర్చకులు శ్రీ ఓంకార సిద్ధేశ్వరస్వామి వారికి మహా మంగళ హారతులు, అభిషేకం, అర్చన పూజలను శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు కాశిరెడ్డినాయన ఆశ్రమం వద్ద అన్న ప్రసాదాలు స్వీకరించారు.

23న వాహనాల వేలం

బొమ్మలసత్రం: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన వాహనాలను ఈనెల 23వ తేదీ వేలం వేయనున్నట్లు నంద్యాల సెబ్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న సెబ్ పోలీ స్టేషన్‌లో వేలంపాట జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు సెబ్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆళ్లగడ్డ: మండలంలోని శాంతినగరం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా ఆరుగురికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ నరసింహులు వివరాల మేరకు.. రుద్రవరంకు చెందిన 15 కూలీలు మంగళవారం ఆటోలో కోవెలకుంట్ల మండలం లింగాలకు మిరప కోతలకు వెళ్లారు. తిరుగుప్రయాణంలో శాంతినగరం వద్ద ఆటో టైరు పేలడంతో బోల్తాపడింది. ఈ ఘటనలో తిరుపతయ్య(40) మృతి చెందాడు. ఆరుగురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.